వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 12 మార్చి 2025

కలర్‌ఫుల్..ఈ పూలు

రామసముద్రం, మార్చి 11 ప్రభాతవార్త:

చెట్టులో ఉన్న ఈ పూలు కనువిందుచేస్తున్నాయి. ఓ చెట్టు ఎర్రటిపూలు పూసి ఆహ్లాదపరుస్తుండగా మరో చెట్టు పసుపుపూలను పూసి కనువిందు చేస్తోంది. రామసముద్రం-చెంబకూరు మార్గంలోని పెంచుపాడు సమీపంలోని రోడ్డుపక్కన మోతుకుచెట్టు ఎర్రటిపూలను పూసింది. ఈ చెట్టు ఇప్పుడిప్పుడే పూలను పూయడం మొదలెట్టింది. పసుపుపూలతో ఉన్న మరోచెట్టు చెంబకూరులో ఉంది. చెట్టు మొత్తం పసుపుదనాన్ని పరుచుకొనేలా పూలనుపూసింది. ఈ రెండు స్థానికులను కనువిందు చేస్తున్నాయి.

ఎర్రటి పూలను పూసిన చెట్టు

పసుపుమయంతో ఉన్న చెట్టు

శ్రీ తిరుపతి గంగమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట

కలికిరి, మార్చి 11, ప్రభాతవార్త:

కలికిరి మండలం మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లిలో వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతుందని సన్యాసివారిపల్లి గ్రామ భక్తాదులు తెలిపారు. 12న గణపతిపూజ, వాస్తుపూజ, గోపూజ, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే 13వ తేదీ గణపతి పూజ, హోమాధి కార్యక్రమాలు, పంచామృతాభిషేకాఉ, కలశ స్థాపన, శుద్ధ పౌర్ణమి, తీర్థ ప్రసాద వితరణ 14న విగ్రహ ప్రతిష్ట ఉదయాత్పూర్వం 4.30 5. గంటల మధ్య జరుగుతుందన్నారు. అమ్మవారి దర్శనం మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని భక్తాదులు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోట్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. భక్తుకు అన్నధాన కార్యక్రమం ఉంటుందని అలాగే అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరుగుతుందని తెలిపారు.

యదేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

మొక్కలు నాటిన వైనం... పట్టించుకోని రెవెన్యూ శాఖ... తగువులతో తల్లడిల్లుతున్న గ్రామాలు

ప్రభుత్వ భూములను కాపాడలేని రెవెన్యూ అధికారులు

రాయచోటి మార్చి11 ప్రభాత వార్త

మండలంలో ప్రభుత్వ భూములను అధికారులకు గ్రామస్తులు పలు సార్లు విన్నవించిన చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాల్లో ఘర్షణలు తలెత్తుతున్నాయి.. ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమి అని తెలిసిన కొందరు రాజకీయ నాయకుల అండదండలతో దౌర్జన్యంగా ఎటువంటి రికార్డులు లేకుండా ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ముందుకెళ్లి రాత్రికి రాత్రే, మొక్కలు నాటితే ఎవరేం చేస్తారనే ధైర్యంతో మామిడి మొక్కలు నాటేస్తున్నారు. ఇలా జరుగుతుందని పలుసార్లు రెవెన్యూ అధికారులకు ఆ గ్రామస్థులు తెలియ జేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులకు, ఆక్రమితదారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. ఇందుకు నిదర్శనం. ప్రస్తుతం ఒదివీడు గ్రామం కుమ్మరపల్లిలో, మండల కేంద్రమైన వీరబల్లిలో ఘర్షణ వాతావరణం నెలకొనేలా ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేసారు. ఒదివీడు గ్రామం కుమ్మరపల్లికి సమీపంలోని అటవీ ప్రాంతంలో 6335 లో రెండు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలో గ్రామంలోని పశువులకు, ఇతర వ్యర్థ పదార్థాలకు, గ్రామ అవసరాలకు అందరూ వినియోగించుకునేవారు. ఈ ప్రభుత్వ స్థలం విషయమై పలుసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఏవైనా ప్రభుత్వ అవసరాలకు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామానికి చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు ఆ స్థలంపై కన్నేసి రాత్రికి రాత్రే మామిడి మొక్కలు నాటడం జరిగింది. ఉదయం గ్రామమంతా వెళ్లి పరిశీలించగా ఆ సమయంలో వారి మధ్య ఘర్షణ నెలకుంది మొక్కలు ప్రభుత్వ స్థలంలో ఎలా నాటతారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు మంగళవారం పోలీస్ బందోబస్తు వెళ్లి నాటిన మామిడి చెట్లను తొలగించక ఆ విశ్రాంతి ఉపాధ్యాయునికే వత్తాసు పలుకుతూ గ్రామస్తులపై విరుచకపడడం ఏమిటని గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం చేసారు. స్థలం కొలిచే అంతవరకు ఎవరు ప్రభుత్వ స్థలంలోనికి ప్రవేశించరాదని తెలిపి వచ్చేశారు. ఇలా చేయడం వల్ల ఆక్రమితదారుడు యదేచ్ఛగా మొక్కలు సాకడానికి నీటిని వేయడం జరుగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజా అవసరాలకు ప్రభుత్వ అవసర కార్యాలయాలకు ఈ స్థలాన్ని వినియోగించాలని జిల్లా ఉన్నతాధికారులకు కలెక్టర్‌కు వారు విన్నవించుకుంటున్నారు. ఇలాంటి తంతులోనే మండల కేంద్ర సమీపంలో 5751, 5752 సర్వే నెంబర్లలో నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని ఆక్రమించడానికి కొందరు ఎటువంటి ఆధారాలు లేకుండా సన్నద్ధమవుతున్నారు. అలాంటి వారికి కొందరు అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉంది. ఆ నాయకులు ఓ సంబంధం లేని వ్యక్తితో గలాటాలకు కారణం చేస్తున్నారు. ఆ స్థలంలోనే

కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, రెండు గోడౌన్లు, టీటీడీ కళ్యాణ మండపం ఏర్పాటుకు పనులు పూర్తి చేయడం కూడా జరిగింది. అదే స్థలం సమీపంలో పాత్రికేయులకు కూడా ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగింది. ఇటీవల వారు ఇల్లు నిర్మాణానికి సదరు భూమి చదును చేయడానికి వెళ్ళగా భూమికి సంబంధం లేని వ్యక్తులు ఘర్షణకు విచ్చేసి, వారి దగ్గర ఎలాంటి ఆధారం లేకపోయినా కేవలం నాయకుల అండదండలతో నిలువు దళ చేశారు. ఈ విషయమై చాలా మార్లు ఉన్నతాధికారులకు, రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్న సమస్య పరిష్కరించి ప్రభుత్వ భూమి అని బోర్డు నాటిన సందర్భాలు లేవు. పరిష్కరించిన దాఖలాలు లేవు. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనడం జరిగింది. ఈ విషయం పట్ల కూడా సంబంధిత అధికారులు నిమ్మకి నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఆక్రమిత దారుడు పలుమార్లు ఉన్నత అధికారుల వద్దకు వెళ్లి స్థలం మాదే మాకే ఇవ్వాలంటూ అర్జీలు పెట్టడం ఇప్పటికీ జరుగుతూనే ఉంది. ఇలా మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారి పట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ భూములకు మరియు ప్రభుత్వం కల్పించిన ఇండ్ల పట్టాలకు రక్షణ లేకుండా పోతుందనీ మండల ప్రజలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమిత దారుల పట్ల చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ ప్రజలు తెలుపుతున్నారు. ఈ విషయమై తాసిల్దార్ వెంకటేష్ ను వివరణ కోరగా ఒదివీడులో ఆక్రమించిన భూమి పట్ల విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపడం శోచనీయం.

ప్రగతి పరుగులు పెట్టేలా

'ఐఏఎస్' పాలన

జిల్లాకో అధికారి... వీరిపై జోనల్ స్థాయిలో మరో సీనియర్ ఐఏఎస్

అన్నమయ్య జిల్లాకు వి.వినయ్ చాంద్, కడపకు సౌరభ్ గౌర్

రాజంపేట అర్బన్, మార్చి 11, ప్రభాతవార్త:

ప్రగతి పరుగులు పెట్టాలి. ప్రజా పరిపాలన జవాబుదారితనంగా ఉండాలి. ప్రభుత్వ ప్రాధాన్యతలు తెలుసుకొని పరిపాలన సాగించాలి. లక్ష్యాలను సాధించాలి. ప్రాధాన్యత పనులపై దృష్టి సారించాలి. అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి. సంస్కరణలు ప్రజలకు చేరాలి. సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రభుత్వం అనుకున్నట్లు ప్రజలకు చేరాలి. అంతిమంగా కూటమి ప్రభుత్వ పాలన భేషుగ్గా ఉందని ప్రజల్లో అభిప్రాయం ఏర్పడాలి. ఇవి తాజాగా ఐఏఎస్ అధికారులను నియమించడం వెనుక ప్రధాన కారణాలు అని చెప్పవచ్చు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిల్లాల వారీగా ఐఏఎస్ అధికారులను ఇంచార్జ్‌లుగా నియమించింది.

అన్నమయ్య జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి వి.వినయ్ చాంద్‌ను నియమించారు. కడప జిల్లాకు సౌరభ్ గౌర్‌ను నియమించారు. రాయలసీమ జిల్లాలకు జోనల్ ఇంచార్జ్‌లుగా సీనియర్ ఐఏఎస్ అధికారి జీ.అనంతరామ్‌లు నియమితులయ్యారు. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఎంటీ కృష్ణబాబు నియమితులయ్యారు. ఇక జిల్లా ఇంచార్జ్‌లుగా నియమింపబడ్డ ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ, అమలు బాధ్యతలను చూసుకోవాలి. పరిపాలన బలోపేతం చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి. 15రోజులకు ఒకసారి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. గ్రామాల్లో పర్యటించాలి. నెలకు కనీసం రెండు సార్లు గ్రామాల్లో రాత్రి బస చేయాలి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ నెలాఖరున పురోగతి నివేదికను అజమాయిషీ చేసే జోనల్ ఇంచార్జ్‌కు నివేదించాలి. అటు జిల్లా కలెక్టర్ కొత్తగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ఇద్దరు జోనల్ ఇంచార్జ్‌లకు టచ్‌లో ఉంటూ జిల్లాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇస్తూ ఉండాలి. అంతిమంగా చెప్పాలంటే ఒక్కో జిల్లాపై కలెక్టర్ కాకుండా మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌ల అజమాయిషీ ఉంటుంది. జోనల్ ఇంచార్జ్‌లుగా నియమింపబడ్డ ప్రభుత్వ సెక్రటరీ స్థాయి అధికారులు ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గనిర్దేశనం చేస్తూ నివేదికలు సిద్ధం చేయాలి. పరిపాలనలో జవాబుదారితనం పెంచి అటు పారిశ్రామిక వేత్తలు, రైతులు, లబ్దిదారులు, ప్రజా ప్రతనిధులు పన్ను చెల్లింపు దారులను బాగస్వామ్యం చేసి చర్చలు నిర్వహించాలి. అందుకు యంత్రాగానికి శిక్షణ కూడ అందిస్తుండాలి. ప్రధానంగా జిల్లాలలో వచ్చే ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ప్రధాన అజెండాగా తీసుకొని అమలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో జాప్యం, ప్రాధాన్యత కార్యక్రమాలు ద్వారా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలి. దీనికి తోడు జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో పెద్దఎత్తున నిధులు కేటాయించిన ప్రాజెక్టుల పనులు పర్యవేక్షిస్తూ పనులు నిర్దేశించిన కాలంలో జరిగేలా చూడాల్సి ఉంటుంది. వీటన్నింటికి సంబంధించి అటు కలెక్టర్, ఆ తర్వాత ఆ జిల్లా ఇంచార్జ్‌గా నియమింపబడ్డ సీనియర్ ఐఏఎస్ అధికారి నుంచి నివేదికలు తెప్పించుకొని రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి తన బాధ్యతగా కూడ అవసరమైన సిఫార్సులను చేయాల్సి ఉంటుంది. ఏదిఏమైనా తాజాగా చంద్రబాబు గతంలో లాగానే పరిపాలన వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఐఏఎస్‌లనే నమ్ముకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఐఏఎస్‌ల భుజస్కందాలపై కూటమి ప్రభుత్వ బరువు బాధ్యతలను ఉంచినట్లుగా కనిపిస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోగా కొత్తగా ఏర్పాటుచేస్తున్న వ్యవస్థలో సత్ఫలితాలు ఉండాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఈ విధాన నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవస్థ బ్యాలెన్స్ తప్పితే సమస్య కూడ లేకపోలేదు. ఐఏఎస్, సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర స్థాయి సీనియర్ ఐఏఎస్‌లు ముగ్గురు కలిపి ట్రాక్ తప్పకుండా ప్రభుత్వం నిర్దేశించిన పరిపాలన, ప్రగతి, అభివృద్ధి పరుగులు తీయడమే అంతిమ కర్తవ్యంగా పనిచేస్తేనే సత్ఫలితాలు సాధ్యం అవుతాయి.

వైభవంగా ప్రసన్నవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్, మార్చి11 (ప్రభాతవార్త) :

బద్వేలు మండల పరిధిలోని లక్ష్మిపాళెంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. మంగళవారం మూడవ రోజు తెల్లవారుజాము నుంచే వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బద్వేలు పట్టణ పరిసర ప్రాంతాలవారు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారినిదర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దేవాదాయ కార్యనిర్వహణాదికారి రామలింగారెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ చాటకొండు సత్యసంజీవ్‌కుమార్, ధర్మకర్తలు భూపాళం రాఘవేంద్ర, కర్ణమడకల బీనా, నల్లి వీరమ్మ, సంపతి వెంకటసుబ్బయ్య, అనగొంది ఓబులేసు, ఒంటె చిన్న పీరయ్య, నాగయ్యగారి సిద్దమ్మ భక్తులకు స్వామివారికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి యాలివాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అడుగడుగునా మంచినీరు వారుపోసి తమభక్తిని చాటుకున్నారు ప్రత్యేక ఉభయదాతలుగా కీ.శే.మాకినేని వెంగయ్య, సతీ మణి గోపమ్మ, వారి దత్తు కుమారుడు కీ.శే. వంకరాజు పిచ్చయ్య, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా పూజ లు నిర్వహించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, మార్చి 11 ప్రభాత వార్త

జిల్లాలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటికి సంబంధించిన రహదారుల నిర్మాణం, పర్యాటక ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ఒక జిల్లా ఒక పర్యాటక ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, హార్సీ హిల్స్ లో చేపట్టబోయే టెంట్ సిటీ ప్రాజెక్టు, అన్నమాచార్యుల వారి గురించి మరియు అన్నమాచార్య కీర్తనలను ప్రచారం చేయడం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాలకు రహదారుల నిర్మాణం త్వరగా పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన కార్పొరేషన్ వారు అరకు కాఫీ కోసం అడిగిన స్థలాన్ని కేటాయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్కు ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్ట్ కింద అన్నమయ్య జిల్లాలో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. అన్నమాచార్యులు వారి కీర్తనలను ప్రచారం చేసేందుకు టిటిడి వారితో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. హార్సిలీ హిల్స్లో నిర్మించబోతున్న టెంట్ సిటి పై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా డిఎఫ్ఓ, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఫ్లోరెన్స్ ఆస్పత్రిని సీజ్ చేసిన డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ

వైద్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డిఓ సాయి శ్రీ

ప్రొద్దుటూరు మార్చి 11 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణం విజయనగరం వీధిలో ఉన్న ఫ్లోరెన్స్ ఆసుపత్రిని ఎట్టకేలకు వైద్యశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వైద్యశాఖ అధికారుల అనుమతి లేకుండా నర్సు రాజి కాన్పులు, ఆపరేషన్లు, అబార్షన్లు చేస్తున్నారు అన్న ఫిర్యాదుల మేరకు వైద్యశాఖ అధికారుల బృందం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరుకు వచ్చారు. డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ శివప్రసాద్ రెడ్డి, కడప నుంచి వచ్చిన డిఎంఅండ్హెచ్ ఓ కార్యాలయ అధికారులు ఫ్లోరెన్స్ ఆసుపత్రిని పరిశీలించారు. కేవలం జనరల్ మెడిసిన్ కు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఫ్లోరెన్స్ ఆస్పత్రి పైభాగంలో మహిళలకు ఆపరేషన్ నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన థియేటర్‌ను పరిశీలించి నర్సు రాజీపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి ఇవ్వకుండా ఏ విధంగా కాన్పులు చేస్తున్నావని ప్రశ్నించారు. ఇదివరకే అబార్షన్లు చేసిన విషయాన్ని అధికారులు మీడియా ముందే నర్సు రాజిని ప్రశ్నించారు. 2023వ సంవత్సరంలో డిఎంహెచ్వో తనిఖీలు చేసి అనుమతి లేకుండా కాన్పులు నిర్వహిస్తున్న ఇదే ఆస్పత్రిని సీజ్ చేసిన అనంతరం దరఖాస్తు చేసు కున్న సందర్భంలో జనరల్ మెడిసిన్ కు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అయితే డాక్టర్ సాయి ప్రసాద్ పేరుతో నర్స్ రాజి అనుమతి తెచ్చుకొని కాన్పులు నిర్వహిస్తున్న విషయం విచారణలో వెల్లడయ్యిందన్నారు. బాధితురాలు భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డీవో

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రొద్దుటూరు పట్టణం విజయనగరం వీధిలో నిర్వహిస్తున్న ఫ్లోరెన్స్ ఆసుపత్రిని జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ మంగళవారం పరిశీలించారు. అక్కడే ఉన్న నర్సుతో ఆర్డీవో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఏ విధంగా కాన్పులు ఆపరేషన్లు చేస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకుండా ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారా అంటూ

ప్రశ్నించారు. అలాగే వారాహి ఆసుపత్రిని ఆర్డీవో పరిశీలించారు. ఆస్పత్రికి అనుమతులు ఉన్నాయా అని డిప్యూటీ డిఎంఎచ్ఓ శివప్రసాద్ రెడ్డిని ప్రశ్నించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని మొదటిసారి రిజెక్ట్ అయిందని రెండవసారి డిఎం అండ్ హెచ్ ఓ పరిశీలించారని, అనుమతులు కావలసిన అన్నింటిని ఆన్లైన్లో అప్లై చేశారని డిప్యూటీ డిఎంహెచ్వో వెల్లడించారు. అధికారుల పర్యవేక్షణ సరిగా లేదంటూ ఆర్డీవో మండిపడ్డారు. ఎట్టకేలకు ఫ్లోరిన్స్ ఆసుపత్రిని సీజ్ చేసిన అధికారులు , వారాహి ఆసుపత్రి నిర్వహణపై విచారణ చేసేందుకు జిల్లా కలెక్టర్కు నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

పలు హోటళ్ల తనిఖీ

బద్వేలు అర్బన్, మార్చి11 (ప్రభాతవార్త) :

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో మంగలవారం కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి ప్రజారోగ్య సిబ్బందితో కలిసి పలు హోటళ్లను తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ హోటళ్ల యజమానులు ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితులలో ప్లాస్టిక్‌ను వాడకూడదని, ప్లాస్టిక్ వాడడం వలన అనేక రకాల సమస్యలకు గరయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు, హోటళ్లవారు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. ప్రతి రోజూ హోటళ్ల తనిఖీని శానిటేషన్ సెక్రటరీలు నిర్వహించడం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ హోటళ్లలో పరిశుభ్రతను పాటిస్తూ ఏ రోజుకు ఆరోజు ప్రజలు ఇనే ఆహారాన్ని నాణ్యతగా అందించాలన్నారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకుంటామని, హోటళ్లలో ప్లాస్టిక్ వాడితే తమ సచివాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ప్లాస్టిక్ హోల్‌సేల్‌షాపుల తనిఖీ:

మున్సిపాలిటీ పరిధిలోని ప్లాస్టిక్ అమ్ముతున్న దుకాణాలను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తనిఖీ చేశారు. వ్యాపారులు ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ నియంత్రణలో ఉందని, శనివారం నుంచి ప్లాస్టిక్ నియంత్రణపై స్పెషల్ డ్రైవ్ ఉంటుంని, ఆలోపు ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయంగా ఏమి వాడాలో సూచిస్తామన్నారు.

నిరాశ్రయుల గూడును కూల్చడం సరికాదు

బద్వేలు, మార్చి11 (ప్రభాతవార్త) :

ఎంతోమంది నిరాశ్రయులకు ఆకలితీర్చి వారు ఉండేందుకు గూడును ఏర్పాటుచేసిన కాశినాయన క్షేత్రంపై ఇలా కూల్చివేతలు చేయడం సమంజసం కాదని వైసీపీ నాయకురాలు శ్యామల అన్నారు. కాశినాయన క్షేత్రంలో ఆలయ కూల్చివేతపై ఆమె ఆవేదనకు గరై మంగళవారం కాశినాయన క్షేత్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఏది ఆశించకుండా ఆకలితో ఎంతమంది వచ్చినా వారి నుంచి రూపాయి తీసుకోకుండా ఆకలి తీర్చే ఇలాంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టిపెట్టి అబివృద్ధికి పాటుపడాలి తప్ప ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కూడా కాశినాయన అభివృద్ధికోసం కేంద్రమంత్రిని కలిసి విన్నవించి కాశినాయన క్షేత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వివరించడం జరిగిందన్నారు. ఇంత జరుగుతుంటే పిఠాపురం పెద్దలు ఎందుకు నోరు మెదపడం లేదని వారికి సంబంధించిన శాఖే కదా హిందూ పరిరక్షణ కాపాడాల్సిన బాధ్యత లేదా అని విమర్శించారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలని సమస్యలుంటే పరిష్కరించి క్షేత్రాల అభివృద్ధికి కృషిచేయాలి తప్ప ఇలా కూల్చుకుంటూ పోతే ఒక్కటి ఉండదన్నారు. కాశిరెడ్డినాయనకు ప్రపంచంలోనే ఎంతోమంది భక్తులు ఉన్నారని, వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకుని దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఈమె వెంట పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మెన్‌గా వెంకటకృష్ణారెడ్డి ఎన్నిక

ఖాజీపేట, మార్చి 11, ప్రభాతవార్త:

ఖాజీపేటలో నిర్మించిన హరిహర సుత ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థాన నూతన కమిటీని 19మంది సభ్యులతో సోమవారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ 19మంది కమిటీలో కమిటి అధ్యక్షునిగా పత్తి వెంకట కృష్ణారెడ్డిని తిరిగి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉండేల వీర రాఘవరెడ్డిని మరియు ఆంబోరు సుబ్బారావులను, ప్రధాన కార్యదర్శిగా మోక్షగుండం ఆచారిని, కోశాధికారిగా చైతన్య విద్యాసంస్థ అధినేత మునగాని శ్రీనివాసులును, ఉపకోశాధికారిగా బీచర్ల తులసీఈశ్వర రెడ్డిలను ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుంకు సత్యనారాయణలను ఎన్నుకున్నారు. తదనంతరం అధ్యక్షుడుతో సహా 19మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సంధర్భంగా ఆలయ కమిటి అధ్యక్షులు పత్తి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం గావించినప్పటి నుంచి ఈనాటి వరకు కమిటి సభ్యులు అందరూ చాలా కష్టపడి దేవస్థానం అభివృద్ధికి సహకరించారని అందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, తేదేపా నాయకులు ఇరగంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, పాటిమీద పల్లె శ్రీనివాసులు, తాత షోరూం అధినేత తాతానర్సింహులు, ఖాజీపేట మాజీ సర్పంచ్ మాకం రామకృష్ణయ్య, మీ సేవ సుబ్రమణ్యం మరియు భక్తాదులు పాల్గొన్నారు.

నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

పోరుమామిళ్ల రూరల్, మార్చి 11 ప్రభాతవార్త:

స్థానిక పోరుమామిళ్లలో 14 /3/ 2025 వ తేదీ కడప ఈటీఎఫ్ ఆఫీసు నందు నిరుద్యోగ సదస్సు జయప్రదం చేయాలని మంగళవారం సిపిఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి యన్ భైరవప్రసాదు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామనురు శ్రీనివాసులురెడ్డి, షేక్ గౌసియా భేగం కుమార్ స్వామి రెడ్డి సీపియం మండల కార్యదర్శి యన్ భైరవప్రసాదులు సంయుక్తంగా మాట్లాడుతూ 2025 మార్చి 14వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కడప నగరంలోని బాలాజీ నగర్, ఎస్వి డిగ్రీ కళాశాల వద్దనున్న యుటిఎఫ్ భవన్ నందు జరుగు నిరుద్యోగ వ్యతిరేక సదస్సుకు పెద్దసంఖ్యలో నిరుద్యోగ, విద్యార్థి యువతీ, యువకులు, ప్రజాఅనుకూల మేధావులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, యువకుల సమస్యలను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ విధానాలు, పాలసీలు రూపొందించుకోవడం లేదు. బిజెపి పాలకులు యువతకు ఉపాధి కల్పించకుండా మత ఉన్మాదం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గుండాల శ్రీనివాసులు, కుసులూరి రవిలు పాల్గొన్నారు.

పాఠశాలల విలీన పక్రియను నిలిపివేయండి

వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పోరుమామిళ్ల రూరల్, మార్చి 11ప్రభాతవార్త:

ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలను కనుమరుగు చేసేందుకు కంకణం కట్టుకున్నదని,అలాంటి విధానాన్ని విరమించుకోకపోతే ఉద్యమాన్ని చేపడతామని పోరుమామిళ్ల మండల ఫ్యాప్టో నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సి.బి.బాల అంకిరెడ్డికి వినతి పత్రం అందిస్తూ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ, ఉపాధ్యాయుల ఆమోదంతో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొని రావాలని, అలాకాకుండా సొంత నిర్ణయంతో పాఠశాలలను విలీన పక్రియచేస్తే, పేద,బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య దూరమవుతుందని, 50 మంది విద్యార్థులున్న ప్రతి పాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాల గా మార్పు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలనీ, లేనిపక్షంలో మొండి గా వ్యవహరిస్తే ఉద్యమబాట పడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె. పుల్లయ్య, నూనె శ్రీనివాసులు, కె. వెంకట్రామిరెడ్డి, చంద్రహాసరెడ్డి, పుల్లారెడ్డి, చెన్నయ్య, రాంబూపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, గుర్రయ్య, ఈశ్వరయ్య, జి. శ్రీనివాసులు, కె. జె. ప్రవీణ్, యమ్. సి. గుర్రయ్య, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం

పులివెందుల,మార్చి11,ప్రభాతవార్త:

కడపలో బుధవారం జరిగే యువత పోరుఖితో ప్రభుత్వాన్ని ఫీజు రీఎంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పులివెందుల వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ యువత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చారు అని తెలిపారు. నిరసన కార్యక్రమం వల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి సమస్యలుపరిష్కారమవుతాయి అని కావున వైఎస్సార్‌సీపీ పార్టీ అనుబంధ విభాగాలు నాయకులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ పులివెందుల మండల అధ్యక్షుడు ఎస్.రాజేష్, నంద, వాలంటరీల విభాగం అధ్యక్షుడు మిత్ర ఆనంద్, వికలాంగుల అధ్యక్షుడు భాస్కర్ , పప్పన్న రాయల్ ,తొండూరు, మండల యూత్ నాయకులు అది కేశవరెడ్డి ,అప్పస్వామి,ఖాదర్, అబ్దుల్, సలీం,కార్తీక్, మహమ్మద్ ,బద్రి చరణ్, ఇంతియాజ్, సుభాన్ నాయకులు పాల్గొన్నారు.

ఛాతి నొప్పితో వ్యక్తి మృతి

సిద్దవటం, మార్చి 11, ప్రభాతవార్త:

జీవనోపాధి నిమిత్తం చేపల వేటకు వెలుగు పల్లి పెన్నానది వద్దకు మండలం లోని కమ్మపాలెం ఎస్టీ కాలనీకి చెందిన ఆదినారాయణ(35) మంగళవారం వెళ్లగా ఒక్క సారిగా ఛాతి నొప్పి రావడం జరిగింది. దీంతో బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డా.ప్రకాష్ పరీక్షలు చేసి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య లక్ష్మీదేవి తన భర్త మృతితో తమకు దిక్కెవరి బోరున విలపించారు. అంత్యక్రియల నిమిత్తం రాజంపేట నియోజకవర్గ యువ నాయకుడు రాజా నాయుడు రూ.10వేలు సాయం చేయడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కాశినాయన ఆశ్రమంలో భవనాలు కూర్చోడం దారుణం

పోరుమామిళ్ల రూరల్, మార్చి11 ప్రభాతవార్త:

కాశినాయన ఆశ్రమం జ్యోతి క్షేత్రంలో భక్తులు నిర్మించిన భవనాలను కూల్చడం దారుణమని మాజీ ప్రభుత్వ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ శ్రీ కాశి నాయనా చాలా మహిమ కలిగిన యోగి అని ఆయన ఉన్నప్పుడు పాతబడిన అనేక దేవాలయంలో పునరుద్ధరించడం ఆయన ఆశ్రమాలు కట్టించడం ఆయన యోగ సమాధిలో పోయిన తర్వాత రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వందలాది కాశి నాయన ఆశ్రమాలను భక్తులు నిర్మించి నిత్య అన్నదానం కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తర్వాత అంత మహిమ గలిగిన వ్యక్తి శ్రీ అవధూత కాశినాయన అని ఇక్కడి భక్తుల విశ్వాసం ప్రతిరోజు జ్యోతి క్షేత్రంలో వద్దలాదిమందికి భోజన వసతులు, ఆంధ్రప్రదేశ్ నుండే కాకుండా తెలంగాణ, కర్ణాటక,చెన్నై నుండి ఆయన భక్తులు లక్షలాదిమంది భక్తులు వస్తూ ఉంటారన్నారు. పార్టీలకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు కాశినాయన ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సెంట్రల్

మాట్లాడుతున్న పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

గవర్నమెంట్‌తో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించే దానికి కృషి చేయాలన్నారు. అలాగే అధికారులకు ఒత్తిడి వల్ల పోలీసులు, ఫారెస్ట్ అధికారులు పై అధికారుల ఒత్తిడితో వారు చేస్తున్నారని వారికి పై అధికారుల నుండి మళ్లీ ఆదేశాలు రాకుండా చూడవలసిన బాధ్యత అధికార పార్టీపై ఉన్నదన్నారు.

ఫాల్గుణ మాసంలో హనుమంతునికి ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్, మార్చి11 ప్రభాతవార్త :

పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకం, సిందూరం అర్చన, ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఉభయదాతలుగా తుమ్మలపెంట సురేష్‌బాబు, సతీమణి జయప్రదాదేవి, పబ్బతి హజరత్, సతీమణి వెంకటసుధామణి, తులసి వెంకటశినారాయణ సతీమణి ఇందుమతి,మూర్తుల సరాబు పెంచలయ్య, సతీమణి లక్ష్మిదేవి, మాలేపాటి సుధాకర్, సతీమణి సుప్రియ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చే అబయాంజనేయ స్వామి వారిని పలువురు భక్తులు, భక్తి, శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వివి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిని దర్శించుకున్న శ్యామల

బ్రహ్మంగారిమఠం మార్చి 11 ప్రభాతవార్త :

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానాన్ని ముందే రచించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారిని మంగళవారం వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల ఆమె భర్త దర్శించుకున్నారు. వీరికి ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిమిదో తరం మనవడు శ్రీ వెంకటాద్రి స్వామి,శ్రీ దత్తాత్రేయ స్వామి, వారు ఆమెకు కాలజ్ఞానం గురించి తెలియపరిచి ఆమెను సన్మానించి నూతన సంవత్సర క్యాలెండర్ ను తీర్థ ప్రసాదలను అందజేశారు బద్వేల్ జెడ్పిటిసి పోలిరెడ్డి, అమగంపల్లి ప్రభాకర్ రెడ్డి, ఆమగంపల్లి సర్పంచ్ సురేష్ బాబు,బ్రహ్మంగారిమఠం వైఎస్ఆర్సిపి నాయకులు యల్లటూరు శివారెడ్డి,తదితదురులు పోల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి

బ్రహ్మంగారిమఠం మార్చి 11 ప్రభాతవార్త :

ఈనెల 14న కాకినాడ జిల్లా పిఠాపురం చిత్రాలలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ విజయవంతం చేయాలని జనసేన నాయకులు పేర్కొన్నారు. జిల్లా పార్లమెంట్ బాధ్యులు రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర సూచన మేరకు ,జనసేన నాయకులు లక్ష్మీ భరత్ అధ్యక్షతన గోశెట్టి చిలుం గారి గారి కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు బ్రహ్మంగారిమఠం మండలం ఐదు రోడ్ల కూడలి నందు వారు మాట్లాడుతూ ఈనెల 14న కాకినాడ జిల్లా లో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు చలో పిఠాపురం అనే గోడపత్రాలను విడుదల చేశారు. మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం నుంచి పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు జనసేన పార్టీ 100 స్ట్రైక్ రేటుతో జరుగుతున్న ఈ ఉత్సాహంలో అందరు పాల్గొని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు మురళి, జనసేనవార్డు నెంబర్ రాజేష్, అంబిశెట్టి వెంకటసుబ్బయ్య, పసుపులేటి వెంకటసుబ్బయ్య, సురేష్, తుపాకుల భద్ర, కొక్కు రవి,పాండు, మహేష్, రమేష్, అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెండర్ల కోసం కమిషనర్ కు వినతి..

కడప కార్పొరేషన్ మార్చి 11 ప్రభాతవార్త:

కడప నగరంలో చికెన్ వ్యర్థాలు తరలించే కాంట్రాక్ట్ ఆగస్టు మాసానికి పూర్తయిందని, కనుక నూతన టెండర్లను పిలవాలని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డిని టిడిపి నాయకులు కొండ సుబ్బయ్య మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. సదరు కాంట్రాక్టర్ దగ్గర నుంచి ఇప్పటివరకు రావలసిన బకాయిలు ఏడు లక్షలు వసూలు చేయాలని కూడా కోరారు. క్యాన్సల్ చేసి కొత్త టెండర్లను త్వరలో పిలుస్తామని కమిషనర్ సానుకూలంగా స్పందించారని కొండ సుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి, ఆవుల దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా పెట్టుకోండి

సిద్దవటం, మార్చి 11, ప్రభాతవార్త:

సిద్దవటం మండలం లోని పెద్దపల్లి, భాకరాపేట, శివునిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం శానిటేషన్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ సెక్రటరీ రాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్‌పై అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు అందించామని ఎండు చెత్త, పొడి చెత్త వేరు వేరుగా చేసి ప్రతి రోజు గ్రామాలకు వచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలో వేసేందుకు హరిత రాయబారులకు చెత్త అందించాలని పారిశుద్ధ్యం నిల్వ లేకుండా గ్రామ మహిళా సర్పంచ్ తుర్రా చిన్నక్క ఆధ్వర్యంలో గట్టి చర్యలు తీసుకొని పనులు చేపట్టామని విద్యుత్తు దీపాల సమస్యలు ఉంటే ప్రజలు తెలియజేసి సమస్య పరిష్కారం చేసుకోవాలని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఉన్న చోట సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని ప్రతి ఒక్కరూ గ్రామాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ

కలికిరి, మార్చి 11, ప్రభాతవార్త:

ఈనెల 1వ తేదీ నుంచి 30 వరకు పశు సంవర్ధకశాఖ తరుపున గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఆందులో భాగంగా ఉపసంచాలకులు డా.కె.విశ్వేశ్వర్‌రెడ్డి, మదనపల్లి వారు కలికిరి మండలానికి ఆకస్మిక తనిఖీలో భాగంగా కొటాల గ్రామానికి విచ్చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈనెల 1వ తేదీ నుంచి 30 వరకు జరిగే ఈ కార్యక్రమం ప్రతి రోజు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉదయం 9.30 వరకు రైతుల ఇంటి వద్దనే పశువులకు టీకాల పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. 4 నుంచి 8 నెలల మధ్య వయసున్న పెయ్య దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేయించాలని సిబ్బందికి సూచించారు. ఈ గాలికుంటు వ్యాధి టీకాల వలన పాలు తగ్గుతాయి లాంటి అపోహలు పెట్టుకోవద్దని రైతులకు తెలిపారు. ఈ అవకావాన్ని రైతులందరూ కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా.కె.వెంకట ముని నాయుడు, కలికిరి మండల పశువైద్యాధికారి డా.గిరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ నిధులు మంజూరు

పులివెందుల,మార్చి 11,ప్రభాత వార్త:

పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎంఆర్ ఎఫ్ నిధులను కూటమి ప్రభుత్వం అందిస్తోంది అని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి శ్రీమతి ఉమాదేవి అన్నారు. మంగళవారం వారి స్వగృహం నందు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజక వర్గంలోని 17 మంది లబ్ధిదారులకు మొత్తం రూ 14,58,091/ ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశార్డు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని అన్నారు.మీ కుటుంబా నికి ఆసరాగా ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్న గొప్ప మానవతావాది మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని బాధిత కుటుంబాల తరపున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేప నాయకులు బొజ్జా మైసురా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తతోనే కంటి చూపు పదిలం

చిట్వేలి,మార్చి 11, ప్రభాతవార్త:

వ్యాధి వివరాలు తెలుపుతున్న అధికారి ఓబులేసు.

కంటి సంబంధిత ఇబ్బందులను ముందుగానే గుర్తించి వైద్యం పొందడం వల్ల చూపును పదిలంగా కాపాడుకోవచ్చని జిల్లా ఆప్తాలిక్ అధికారి డాక్టర్ ఓబులేసు అన్నారు. మంగళవారం గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా కంటి ఇబ్బందులు, ముందస్తు నివారణ చర్యల గురించి పీహెచ్సీ వైద్యులు అన్సారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య నిపుణులు ఓబులేసు మాట్లాడుతూ కంటిలో పెరిగే అధిక పీడనం, ఆప్టిక్ నాడి సన్నబడడం, గ్లకోమా కుటుంబ చరిత్ర కలిగి ఉండడం, చక్కర వ్యాధి కలవారు గాయాలు వలన మరియు అధిక స్టెరాయిడ్స్‌ను వాడటం వల్ల ఈ గ్లకోమా వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నివారించడానికి 40 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్యులు సూచించిన కంటి పరీక్షలను చేయించుకుని వైద్యుని సలహాలు పొందాలని తెలిపారు. తదుపరి ఇదివరకు పరీక్షలు నిర్వహించిన ఎంపికైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సల్మా.ఎం పి హెచ్ ఓ విజయ్ కుమార్, ఎల్ డి సి రవిశంకర్, పీహెచ్ఎన్ విజయ్ కుమారి మరియు ఏం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవాలి

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న వెంకటరమణ

నిమ్మనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త:

మండలంలో అధికారులు వారి వారి స్వయంకృషితో ఐక్యమత్యంతో మండల వాసులకు సేవలు అందించాలని టిడిపి పార్టీ మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక షాదీమహాల్ ప్రాంతంలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన విషయాలు మరచి, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ ఒక్క తాటిపై నడిచి పూర్వ వైభవం తేవాలని, అదేవిధంగా శాసనసభ్యులు షాజహాన్‌బాషాకు తెలుగుదేశం పార్టీకి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, రాజంపేట బిసి అధికార ప్రతినిధి లక్ష్మన్న, మైనార్టీ నాయకులు షఫి, జనసేన మండల అధ్యక్షులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లిని దర్శించుకున్న మోర్యా రెడ్డి

మోర్యారెడ్డిని సన్మానిస్తున్న చికెన్ సెంటర్ వేణు

లక్కిరెడ్డిపల్లి : మార్చి 11 ప్రభాతవార్త

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లిని మంగళవారం టిడిపి యువ నాయకులు మోర్య రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు యాదవ్, చెల్లు దినేష్ యాదవ్‌లు టిడిపి నాయకులు మోర్యా రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈడిగపల్లె గ్రామానికి చెందిన చికెన్ సెంటర్ మురికినాటి వేణు ఆహ్వానం మేరకు విందు కార్యక్రమంలో మోర్యా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చికెన్ సెంటర్ వేణు మోర్యా రెడ్డిని పూల బొకేతో స్వాగతం పలికి దృశ్యాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యువ నాయకులు యనమల మదన్ మోహన్, ఉమా మహేశ్వర్ రెడ్డి, కావలి ఆంజనేయులు, హేమంత్, రవి, శంకర్, భాస్కర్‌రెడ్డి, ఆదిమూలం రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

వాల్మీకిపురం, మార్చి 11. ప్రభాతవార్త :

పట్టణ పడమర పొలిమేర్లలోని ధర్మపథంలో వెలసిన వల్లి దేవసేన నేమత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 14న శుక్రవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మంగళవారం తెలిపారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 5గంటలకు శాస్త్రోక్తంగా శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా గణపతిహోమం, శాంతిహోమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి వారికి ఆకుపూజ, సింధూరపూజ, వడమాలపూజ తదుపరి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్చకులు కోరారు.

ఎమ్మెల్సీగా సోమువీర్రాజు నియామకం పై హర్షం

వేంపల్లి, మార్చి 11, ప్రభాతవార్త :

భాజపాలో కష్టపడిన వారికి గుర్తింపు వస్తుందనడానికి సోమువీర్రాజు నిదర్శనం అని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ అన్నారు. రాష్ట్ర శాసనసభ్యుల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి నుండి బీజేపీ అభ్యర్థి గా సోమువీర్రాజును ఎంపిక చేయడంపై వేంపల్లి బీజేపీ నేతలతోకలసి స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత తో పాటు నమ్మిన సిద్ధాంతం కోసం అంత్యోదయ స్ఫూర్తితో గత 45సంవత్సరాలనుండి భాజపా లో కొనసాగుతూ ప్రభుత్వాల వైపల్యాలపై, ప్రజా సమస్యల పరిస్కారమే ద్యేయం గా అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి సోమువీర్రాజు అని అన్నారు. ఆయన రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కేంద్ర అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి సుస్మా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్, మండల శాఖ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు సౌభాగ్యలక్ష్మి, మునగల వెంకటరమణ ప్రసాద్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగల చంద్ర,ప్రసాద్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత పోరును జయప్రదం చేయండి

వేంపల్లి, మార్చి 11, ప్రభాతవార్త :

వైయస్సార్ కాంగ్రెస

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో యువ జాగృతి

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకూడదని వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానంద జీ మహారాజ్ అన్నారు. మంగళవారం స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం, రామకృష్ణ మఠం సంయుక్తంగా యువ జాగృతి వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా, నైతిక విలువలను అలవర్చుకునేలా, సమాజానికి ఉపయుక్తమైన జ్ఞానాన్ని పొందేందుకు ఒక ప్రేరణాత్మక వేదికగా నిలిచింది. రామకృష్ణ మఠం, స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిస్తూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, సమాజ సేవా దృక్పథాన్ని, మరియు ప్రగతిశీల ఆలోచనలను ప్రేరేపించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతో పాటు మానసిక స్థిరత్వం, ధనాత్మక ఆలోచన, మరియు సమయపాలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వామి అనుపమానందజీ మహారాజ్ విచ్చేసి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలంటే, నైతిక విలువలు, సమర్థత, మరియు మానవతా దృక్పథం అనేవి తప్పనిసరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ఈ. సాయిబాబా రెడ్డి, ప్రిన్సిపల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ డా. ఎస్.ఎం.వి. నారాయణ, మరియు ఈవెంట్ కోఆర్డినేటర్, అలుమ్ని కోఆర్డినేటర్ డా. కె. ప్రసాద్ హాజరై స్వామీజీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని, స్వీయ విశ్లేషణ, సమూహ చర్చలు, మరియు ధ్యానం ద్వారా తమ వ్యక్తిత్వాన్ని మెరుగుపర్చుకునే అవకాశాన్ని పొందారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా, అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు స్వామి అనుపమానందజీ మహారాజ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. యువ జాగృతి" కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సమాజ హితం, వ్యక్తిత్వ వికాసం, మరియు నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యత పెంపొందించినందుకు అన్నమాచార్య విశ్వవిద్యాలయం, రామకృష్ణ మిషన్ నిర్వాహకులను అభినందించారు.

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది

పీలేరు మార్చి 10 ప్రభాతవార్త :

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాము కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని మాలమహానాడు మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గా ప్రసాద్ అన్నారు. మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 2018 లో ప్రణయ్‌ను హత్యగావించాడు. హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష మరో ఆరుగురికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తునమని ఈ తీర్పుతో కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని న్యాయం గెలిచిందన్నారు. ఈ పోరాటంలో న్యాయం వైపు బాధితుల తరపున నిలబడ్డ న్యాయవాదులకు పోలీసులకు మీడియాకు పోరాటంలో నిలబడ్డ సామాజిక సంఘాలకు మాలమహానాడుగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మల రవిచంద్ర,కార్యవర్గ సభ్యులు పెట్లు గణేష్, కోప్పల వినయ్ కుమార్, నీలా మనోజ్, కార్తీక్, జనార్దన్ పాల్గొన్నారు.

మహిళా పోలీస్ అవగాహన సదస్సు

రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త

మండలంలోని పోలీస్ కార్యాలయంలో సీఐ సత్యనారాయణ మంగళవారం మహిళా పోలీస్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉన్న మహిళా పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలని సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. గ్రామాల్లో ఎలాంటి గొడవలు, కక్షలు పడకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ మహిళా పోలీస్ లకు తెలియజేసారు. బెల్ట్ షాపులు నిర్వహించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై జి.రవికుమార్, సిబ్బంది మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ చేరిన పదవతరగతి ప్రశ్న పత్రాలు

రామసముద్రం మార్చి 11 ప్రభాతవార్త

ఈనెల 17 వ తేది నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబందించిన ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్ లో భద్రపరిచనట్లు రూట్ అధికారులు మండలంవిద్యాశాఖ అధికారులు ఆంజనేయులు, నారాయణ తెలిపారు. మంగళవారం సెట్ 2 పదవ తరగతి ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ లో సీఐ సత్యనారాయణ,ఎస్సై జి. రవికుమార్, కానిస్టేబుల్ కిరణ్ యాదవ్ సమక్షంలో భద్ర పరిచినట్లు ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై రవికుమార్, ఆంజనేయులు, హెచ్ ఎం చిట్టిబాబు, నారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై అవగాహన సదస్సు

తొండూరు మార్చి 11 (ప్రభాతవార్త):

తొండూరు మండలవెలుగు ఆఫీస్ నందు ఆదర్శ మండలం అభివృద్ధిలో భాగంగా వార్షిక యాక్షన్ ప్లాన్ పై 2 రోజుల శిక్షణ లో బాగంగా TOT గా APM ఆంజనేయులు సభ్యులకు ఆర్థిక మరియు అర్థికేతర అంశాలు గ్రామస్థాయిలో చేయు వాటిపైన వివరణాత్మంగా వివరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మహిళలు ఆర్థికంగా ఏ విధంగా ముందుకు వెళ్లాలి డబ్బులను సంఘాలలో తీసుకున్న తర్వాత వాటిని ఏ విధంగా వినియోగించాలి అనే అంశాలపై వారికి శిక్షణను ఇవ్వటం ఈ కార్యక్రమంలో APM వెంకటనారాయణ సీసీ లు జిలానీ ఆంజనేయులు, వీరమోహన్ మండల సమాఖ్య సభ్యులు, అందరూ అనిమెటర్లు అకౌంటెంట్ పాల్గొన్నారు.

17న చలో విజయవాడను విజయవంతం చెయ్యండి

సుండుపల్లి, మార్చి11, ప్రభాతవార్త:

మండలంలోని పంచాతి పారిశుధ్య కార్మికులు సమస్య లు పరిస్కారం దిశగా ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రసిడెంట్ సుబ్బరామయ్య పిలుపు మేరకు సుండుపల్లి పారి శుధ్య కార్మికులు ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి నెల 5వ తేది లోపల జీతాలు చెల్లించాలని, 99 జీ ఒ ప్రకారం కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, 8 సంవత్సరాల అపరిస్కృత సమస్యలు పరిస్కారించాలని కార్మికులు అందరు వచ్చి కార్యక్రమంను విజయవంతం చేయాలని తెలియజేసారు.

ఎస్సి, ఎస్టి పోలీస్‌స్టేషన్‌కు డిఎస్‌పిలను నియమించాలి

మదనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :

మాట్లాడుతున్న దృశ్యం

రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌లకు డిఎస్‌పిలను నియమించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలో బహుజనసేన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి ప్రత్యేక సెల్‌కు సంబంధించి 98మంది డిఎస్‌పిలను రద్దు చేసిందన్నారు. ఈ ప్రక్రియ ఎన్నికల ముందు జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సి, ఎస్టిలకు అన్యాయం జరిగితే పట్టించుకునే నాధుడే లేరన్నారు. ఎస్సి, ఎస్టిలకు అత్యాచారాల నిరోధక చట్టం సక్రమంగా, పటిష్టంగా అమలుపరిచే దిశగా రాజ్యాంగం చట్టబద్ధమైన సూచనలు చేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్సి, ఎస్టిలకు సంబంధించి చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే ఎస్సిసెల్‌కు సంబంధించి డిఎస్‌పిల నియామకం చేసి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 24న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎస్సి, ఎస్టి, ప్రజాసంఘాలనాయకులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు హాజరు కావాలన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు జయశంకర్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, జయశంకర్, లారా, రూపక్‌నాయక్, మేరీ,రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దిగువ బూడిదవేడు రైతుషెడ్డులో చోరీ

మదనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :

చోరీకి పాల్పడ్డ దృశ్యం

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని వాల్మీకిపురం మండలం దిగువబూడిదవేడులో శ్రీరాములురెడ్డికి చెందిన వ్యవసాయ షెడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ విషయంపై రైతు శ్రీరాములురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. షెడ్డులో ఉన్న సుమారు రూ.1లక్ష విలువ చేసే వ్యవసాయ పరికరాలను చోరీ చేసుకెళ్ళారు. ఆంజినేయస్వామి గుడి సమీపంలో ఉన్న ఈ షెడ్డులో చోరీ జరగడం వల్ల చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో నాటుసారా తయారీ, జూదరుల నిర్వహన జరుగుతం డడం వల్లే ఈ చోరీ జరిగి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు. పోలీసులు విచారణ జరిపి చోరీని నిగ్గు తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సింహావాహనంపై శ్రీనివాసుడు

రామసముద్రం, మార్చి 11 ప్రభాతవార్త :

మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీలో శ్రీగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహవాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారిని పురవీధుల గుండా మేళతాళాలతో, చెక్కభజనలతో, బాణసంచా పేల్చుతూ ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడి కారు దగ్ధం

పిరికిపందల చర్య : ఆర్‌జె వెంకటేష్

దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఆర్‌జె.వెంకటేష్

రామసముద్రం, మార్చి 11 ప్రభాతవార్త :

రామసముద్రం మండల టిడిపి అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు అగ్నిప్రమాదానికి దగ్ధమైంది. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. ఎవరో కావాలనే కారుకు నిప్పు పెట్టి ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కారు దగ్ధమైన విషయం తెలుసుకొన్న టిడిపి పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి వెంకటేష్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనయుడు జువైద్ అక్బర్‌లు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ ప్రశాంతమైన పల్లెల్లో ఇటువంటి సంఘ విద్రోహక చర్యలు జరగడం గ్రామ ప్రజల్లో చిచ్చుపెట్టడమే అన్నారు. ప్రజాస్వామ్యంలో హింస మంచిది కాదని దానికి చోటు లేదన్నారు. ఇది ఎవరో గిట్టని వారు, ఇది పిరికిపందల చర్యగా అభివర్ణించారు. అనంతరం పోలీస్‌స్టేషన్లఓ అనుమానితులపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు పేర్కొన్నారు. వెంటనే సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రవికుమార్‌లు సంఘటనను పరిశీలించి దగ్ధమైన కారును పరిశీలించారు. కారుకు నిప్పుపెట్టిన వారిని ఎంతటి వారైన వదలిపెట్టమని సిఐ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విషంతాగి వివాహిత ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె, మార్చి 11 ప్రభాతవార్త :

కుటుంబసమస్యలతో విషం తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మంగళవారం నిమ్మనపల్లెలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. నిమ్మనపల్లెకు చెందిన మమత (23) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు వైద్యం అందించక మమత ప్రాణాప్రాయం తప్పి కొటుకుంటూ ఉంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాయచోటి ఘటనపై సమగ్ర విచారణ జరగాలి

రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పి రమేష్ నాయుడు

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాయచోటి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని మంగళవారం రాజంపేట బిజెపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతు గుంట రమేష్ నాయుడు అన్నారు. ఫార్వేట ఉత్సవం సందర్భంగా జరిగిన సంఘటన పైన జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి దోషుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. హిందువుల పైన పెట్టిన కేసులను బేసరత్తుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే దీనికి బాధ్యులైనటువంటి ఎస్ఐ, సీఐ, డీఎస్పీలపైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆలయ భూములకు సంబంధించి అనేక వందల ఎకరాలు అన్యాకాంతం అయిపోయినాయని, వాటన్నిటిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు వివి రమణ, పట్టణ ఉపాధ్యక్షులు రమణారెడ్డి, చిన్నయ్య, తోట నగేష్, మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో సూక్ష్మ జీవుల అభివృద్ధి నిలయం

సుండుపల్లి, మార్చి 11, ప్రభాతవార్త

మండలంలోని తిమ్మసముద్రం యూనిట్ లోని రైతు షేక్. అలీ వారి వంగ, మిరప, కాకర కూరగాయలు పంటలు కు జీవామృతం రెండు లీటర్లు, కోడి గ్రుడ్డు, నిమ్మ రసం ద్రావణం, మరియు బ్రహ్మాస్త్రం తయారు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జి యం. రామ్మోహన్ మాట్లాడుతూ జీవామృతం వలన భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది పంటకు కావలిసిన పోషకాలు అందుతయాని అలాగే కోడి గ్రుడ్డు నిమ్మ రసం ద్రావణం వలన పూత పిందెలు రాలకుండా కాయలు నాణ్యత ను కలిగి ఉంటాయాన్ని వివరించారు. ఇందులో ఎస్. వెంకటయ్య ఎల్2ఎన్ఎఫ్ మరియు బయో రిసోర్స్ సెంటర్ ఓనర్, ఐసిఆర్‌పిలు, కొండమ్మ, టీ. రామాంజనేయులు, సి. రామచంద్ర, రైతులు పాల్గొన్నారు

ఎంపిడివో రెడ్డెయ్య సస్పెండ్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11, ప్రభాత వార్త

లక్కిరెడ్డిపల్లె ఎంపిడివోగా పనిచేస్తున్న రెడ్డెయ్య సస్పెండ్ అయినట్లు జడ్పీసీఈఓ నుంచి సస్పెండ్ ఆర్డర్ వచ్చినట్లు ఈఓపీఆర్డీ ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట ఎంపిడివోగా పనిచేస్తున్న సమయంలో 2024,25 సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంపిడివో మరో నలుగురు సిబ్బంది నిదులు 6 లక్షలుపైగా పనులు చేయకుండా నిధులు దుర్వినియోగంపై జిల్లా అధికారులు సమగ్రవిచారణ చేపట్టరాని క్రమాలు జరిగినట్లు విచారణలో తేలిందని జిల్లా స్థాయి అధికారుల నుంచి సస్పెండ్ ఆర్డర్ వచ్చినట్లు ఆమె తెలిపారు.

గాలి వల్ల క్షయవ్యాధి వ్యాప్తి చెందుతుంది.

క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హరి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11 ప్రభాతవార్త

క్షయవ్యాధి గ్రస్తుడు తుమ్మిన, దగ్గిన గాలివల్ల క్షయవ్యాప్తి చెందుతుందని క్షయవ్యాధి అధికారి హరి పేర్కొన్నారు. మంగళవారం కోనంపేట గ్రామం జాంద్రపల్లె జడ్పీ హైస్కూల్లో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి అధికారి హరి మాట్లాడుతూ రెండువారాల నుంచి దగ్గు, జ్వరంరావడం, దగ్గినపుడు గల్లలో రక్తం పడటం, ఆకలితగ్గడం, ఎదురొమ్ముల్లో నొప్పిరావడం వంటి లక్షణాలు ఉన్న వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెల్లాలని ఆయన సూచించారు. క్షయవ్యాధి గ్రస్తునికి పౌష్టిక ఆహారం కోసం ప్రభుత్వం నెలకు వెయ్యి రూపాయ లు ఇస్తుందని అందులో మందులు కూడా ఉచితంగా అందిస్తోందిని అంతేకాకుండా ప్రభుత్వం 6నెలలకు సంబందించిన మందులు ఉచితంగా అందిస్తుం దన్నారు. క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామక్రిష్ణ. సిహెచ్సి రవీంద్ర, సిహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వెంకటక్రిష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు ప్రారంభించిన బిసి రాష్ట్ర కార్యదర్శి పురం

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు మార్చి 11 ప్రభాతవార్త:

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు పట్టణంలోని బండ్లవంకలో పార్టీ రాష్ట్ర బిసికార్యదర్శి పురం రామ్మూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు పురం రెడ్డమ్మ పది లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు పనులు ప్రారంభించారు. పీలేరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులు కల్పిస్తూ ప్రత్యేక చొర చూపిస్తున్న ఎమ్మెల్యే అవకాశ మొచ్చినప్పుడల్లా అసెంబ్లీలో ప్రతిసారి నియోజకవర్గం అభివృద్ధి, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి కష్టాన్ని గుర్తించి తన గళాన్ని వినిపిస్తున్నారన్నారు. పీలేరు పట్టణమే కాకుండా నియోజకవర్గ పరిధిలో అన్నిచోట్ల అన్ని రకాలుగా అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తూ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాదర్, అశోక్, ఎస్టి నాయకులు సురేష్, షరీఫ్, అంజి, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

చలో పిఠాపురం జయప్రదం చేయండి

పీలేరు మార్చి 11 ప్రభాతవార్త:

పీలేరు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 14 పిఠాపురంలో జరగనున్న ఆవిర్భావ సభకు జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు తరలిరావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారని, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి పిలుపునిచ్చారు. 12 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పిఠాపురంలో భారీ బహిరంగ సభ జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అన్నమయ్య జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగన్ యువ పోరు కాదు
యువతను మోసం చేసే పోరు

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేవూరి వేణుగోపాల్.

రాజంపేట అర్బన్, మార్చి11 ప్రభాతవార్త

ఐదేళ్ల వైసీపి పాలనలో యువత భవిష్యత్తు రాష్ట్రంలో నాశనమైందని మరలా నేడు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చినా సిగ్గు లేకుండా యువతను మోసం చేసేందుకు యువపోరు చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ పై టిఎన్ఎస్ఎఫ్ మండిపడింది. విద్యార్థి,యువత భవితను దెబ్బతీసే జగనే యువ పోరు కాదని దొంగాట అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్రప్రధానకార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ధ్వజమెత్తారు. స్థానిక రాజంపేట పట్టణంలోని టిడిపి పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ తో కలిసి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 4,271 కోట్లు ఫీజు,వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్ రెడ్డి ప్రభుత్వమే అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వైసిపి హయంలో ఎస్సీ,ఎస్టీ మైనారిటీ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి స్వయం ఉపాధి పథకాలు నీరు కార్చారని వివరించారు. ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం జగన్ పాలనలో 2,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యల పాలయ్యారని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌తో జగన్ పాలనలో యువత భవిత నాశనమైందన్నారు. 2014 2019 మధ్య చంద్రబాబు పాలనలో ప్రభుత్వ,ప్రైవేటు రంగంలో 12 లక్షల ఉద్యోగాలు ఉపాధి కల్పించారన్నారు. ఉద్యోగాల కల్పన చంద్రబాబుకే సాధ్యం,యువత భవిత నారా లోకేష్‌తోనే సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, నియోజకవర్గ నాయకులు ముబిసిర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనంగా డబ్బులు చెల్లింపు

పీలేరు కలకడ మార్చి 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాలకు అదనంగా డబ్బులు చెల్లించడం జరుగుతుందని హౌసింగ్ ఏఈ నాగముని నాయక్ పేర్కొన్నారు. 2019,24 సంవత్సరం మధ్య మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు ఎస్సీ, బీసీలకు 50 వేల రూపాయలు, ఎస్టీలకు 75 వేల రూపాయలు అదనంగా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో జిల్లా నిర్మాణాలను నిర్మించుకోలేని నిరుపేదలకు బాసటగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రస్తుతం ఇంటి నిర్మాణాలకు కావలసిన సామాగ్రి అధిక రేట్లు కావడం వల్ల అంతేకాకుండా మేస్త్రీలు కూలీలకు అదనంగా డబ్బులు చెల్లించవలసిన పరిస్థితులు ఉన్నందువల్ల ఇండ్ల నిర్మాణాలను మధ్యలో నిలుపుదల చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9 విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నిరుపేదల ఇల్లు నిర్మించుకోవడానికి ఎంత అవకాశాలు ఉన్నట్టు తెలిపారు.

104 సేవలు సద్వినియం చేసుకోండి

104 సేవలను తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ రహీం

కలకడ మార్చి 11 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంత ప్రజలు 104 సేవలను సద్వినియం చేసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ కోట గుడిబండ గ్రామంలో 104 సేవలను చేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చినట్టు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో 104 సేవలను గ్రామాలలోని ప్రజల దగ్గరకు వచ్చి సేవలందిస్తూ వారికున్న రోగాలను గుర్తించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాల్లోకి వచ్చే 104 సేవలను గుర్తించి ప్రజలకు ఉన్న జ్వరాలు, విష జ్వరాలు, జలుబు తదితర జబ్బులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈ సేవలను ప్రతి ఒక్కరు సద్వినిచేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందు ఉండాలి

ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది పనితీరుపై పోటీలు

పీలేరు మార్చి 11 ప్రభాతవార్త ;

ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు బాగున్నాయని రాయచోటి ప్రభుత్వ వైద్యశాల సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకట శివ తెలిపారు. ఆస్పత్రి ప్రారంభించి ఏడాది పూర్తైన సందర్భంగా ఆసుపత్రిలో సేవలను 7 విభాగాలుగా విభజించి వాటిలో విధులు నిర్వహించే వారి పనితీరును గుర్తించేందుకు పోటీ నిర్వహించారు. ఇందుకోసం మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి మత్తు విభాగం డాక్టర్ వెంకట శివ, హెడ్ నర్స్ బీబీ ఫరీష్ రెండు బృందాలుగా పర్యటించి నివేదికలను తయారు చేశారు. వారు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, పేషెంట్లతోనూ మాట్లాడి మార్కులు ఇచ్చారు. ఈ మార్కుల ఆధారంగా సిబ్బంది పనితీరును గుర్తించడం జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ పోటీలు కేవలం ఆసుపత్రి సిబ్బందిలో పోటీస్ఫూర్తిని నింపేదుకు మాత్రమే నిర్వహించామని, ఇందులో ఎవరు భేషజాలకు పోకుండా భవిష్యత్తులో ప్రథమ స్థానాన్ని సాధించేందుకు మరింత కృషి చేసేలా నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వెంకటశివ ప్రథమ, ద్వితీయ స్థాయి బహుమతులను, మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి CSRMO డాక్టర్ సరస్వతమ్మ నర్సింగ్ సూపర్ ఇంటెండెంట్ షరీఫ్ జాన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాస్కర్ ఆఫీస్ సూపరింటెండెంట్ శివ హెడ్ నర్సులు ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన న్యాయ నిర్ణయితలు, వైద్యులు, వైద్య సిబ్బంది

ప్రథమ బహుమతిని ప్రసూతి విభాగానికి ప్రాతినిధ్యం వహించిన హెడ్ నర్స్ అమ్మాజీ, స్టాఫ్ నర్సులు లావణ్య, జ్యోతి, రేష్మ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు బాదుల్లా, సరిత, పారిశుద్ధ్య సిబ్బంది ఎర్రమ్మ, అమృత బృందానికి అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతిని రోగ నిర్ధారణ విభాగము (లేబరేటరీ, ఎక్స్ రే విభాగము) గెలుచుకుంది. ఈ విభాగానికి ప్రాతినిధ్యం వహించిన హెడ్ నర్స్ పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జున, రేడియోగ్రాఫర్ శ్రీనివాసులు, జిడిఏ స్వామినాథన్, పారిశుద్ధ్య కార్మికులు నాగరాణి, నసీబ్ జాన్ స్వీకరించారు.

అవయవ దానం చేయండి 10 మంది ప్రాణాలు కాపాడండి

ప్రొద్దుటూరు మార్చి 11 ప్రభాతవార్త

ప్రమాదవశాత్తు మరణించినా బ్రెయిన్ డెత్‌తో మరణించిన వారు కూడా అవయవ దానం చేసి పదిమంది ప్రాణాలు కాపాడాలని కొప్పూరు గ్రాండ్ అధినేత కొప్పూరు రమేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తాను లివర్ మార్పిడి చేసుకుని 22 ఏళ్ళు పూర్తి చేసుకొని ఎంతో ఆరోగ్యంగా ఉన్నానని తెలియజేస్తూ రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను 2002లో హైదరాబాదులోని ప్రముఖ గ్లోబల్ ఆసుపత్రిలో లివర్ మార్పిడి ఆపరేషన్ చేసుకున్నారని ఇప్పటికి 22 సంవత్సరాలు పూర్తి అయిన ఎలాంటి అనారోగ్య సమస్యలు కానీ ఎంతో ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ప్రజలలో అవయవ దానం అవగాహన కల్పించేందుకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామన్నారు. ఎవరికైనా లివర్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అవసరమైతే ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు అంతేకాకుండా తాను అలాంటి వారికి ఎవరికైనా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా కావలసిన ఏ

ర్పాట్లు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కావున లివర్ కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకునేందుకు ఎవరు వెనకాడకుండా భయపడకుండా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కొప్పూరు కృష్ణ చైతన్య రెడ్డి ఆసుపత్రి సూపర్డెంట్ ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వ్యవస్థను
ఆధునికరించేందుకు ప్రణాళికలు

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రంథాలయ ఉద్యోగుల సంఘం

ప్రొద్దుటూరు మార్చి 11 ప్రభాతవార్త

చట్టసభలను వేదికగా చేసుకొని రాష్ట్ర ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రంథాలయ వ్యవస్థను పూర్తిగా ఆధునికరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, నేటి సమాజంలో గ్రంథాలయ ఆవశ్యకత గురించి ప్రస్తావించడం శుభ పరిణామం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి రాంబాబు నాదెండ్ల బాబ్జి హర్షం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ ప్రస్తావనతో గ్రంథాలయాల దశ మారుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు గ్రంథాలయాలకు వచ్చు పార్టీ ఆసక్తి కోరిన పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మంత్రి ప్రకటించడం సంతోషకరమన్నారు ప్రస్తుత కాలానికి అనుగుణంగా లైబ్రరీ సమయాలు మార్పు చేయాలని స్థానిక సంస్థల జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించవలసిన లైబ్రరీ సెస్ బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఉద్యోగుల జీతాలు 010 పద్దు ద్వారా చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో కూటమి ప్రభుత్వ పాలనలో వందల వ్యవస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు.

సిబిఐటి కళాశాలకు నోటీసులు

చాపాడు. మార్చి 11. ప్రభాతవార్త.

మండలంలోని పల్లవోలు గ్రామ సచివాలయ పరిధిలో సిబిఐటి కళాశాల భవనాలకు ఇంటి పన్నుల ద్వారా27,92,454. రూపాయలు చెల్లించాలని జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క పేర్కొన్నారు. మంగళవారం ఆమె తన సిబ్బందితో కలిసి కళాశాల పరిపాలన అధికారి శ్రీనివాసులు రెడ్డిని కలిసి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటి పన్నులు చెల్లించాలని పలు దపాలుగా తెలియజేసినప్పటికీ వారిలో చలనం లేదన్నారు. నోటీసులు అందిన ఏడు దినములలోపు బకాయిలు చెల్లించని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పి ఆర్ డి రాధాకృష్ణ వేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, డిజిటల్ అసిస్టెంట్ చంద్ర,, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈనెల 14న జరిగే నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్, మార్చి 11, ప్రభాతవార్త

ఈనెల 14న కడప నగరంలో నిర్వహించనున్న నిరుద్యోగ వ్యతిరేక సదస్సును విజయవంతం చేద్దామని సిపిఎం పట్టణ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు చిన్ని మాట్లాడుతు దేశంలో నిరుద్యోగం రోజురోజుకీ తారాస్థాయికి చేరిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కాయ కష్టం చేసే యువతి, యువకులు పనులు లేక ఇతర రాష్ట్రాలకు, పరాయి దేశాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలకులు యువతకు ఉపాధి కల్పించకుండా మత ఉన్మాదం వైపు మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కావున మార్చి14 ఉదయం కడప నగరంలోని బాలాజీ నగర్,ఎస్వీ డిగ్రీ కళాశాల వద్దనున్న యుటిఎఫ్ భవనం నందు జరుగు నిరుద్యోగ వ్యతిరేక సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బద్వేలు పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, సగిలి రాయప్ప, షేక్ కైరున్ బీ, పసుపుల మోక్షమ్మ, చెప్పాలి సుబ్బరాయుడు, గంప అనంతమ్మ, శాఖా కార్యదర్శులు కొండయ్య, బాలమ్మ, రత్నమ్మ, మస్తాన్ బీ, ఎస్కే ఆదిల్ ముడుమాల ఓబుల్ రెడ్డి, నాగేశ్వరి, రోజమ్మ, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ
ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

బద్వేలు ,మార్చి 11 ప్రభాతవార్త

నూతన రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై ప్రభుత్వ పథకాలకు దూరమైన పేదలకు తక్షణమే ఇంటి స్థలాలు చేసి ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ–నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బద్వేలు మరియు గోపవరం మండల తాసిల్దార్‌లకు దరఖాస్తులతో కూడిన వినతి పత్రాలను సమర్పించడం జరిగింది. అనంతరం పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం సంవత్సరాల తరబడి నూతన రేషన్ కార్డుల మంజూరులో నిర్లక్ష్యం వహించడంతో వందలాది కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి కూడా అర్హులు కాలేక ప్రభుత్వ పథకాలకు దూరమై తాము కష్టపడిన సొమ్ములో కడుపు ఎండబెట్టుకొని మిగిల్చుకున్న డబ్బులను బాడుగలు రూపంలో చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నదని వారు విమర్శించారు. కావున తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హులైన పేదలు కార్మికులకు బద్వేల్ మండలం గుంతపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 948/2,4 మరియు సెంచరీ పరిశ్రమ పక్కనే ఉన్న సర్వేనెంబర్ 1557 నందుగల ప్రభుత్వ భూములో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఎన్టీఆర్ గృహాలకు కేటాయించి ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్ రాజు, జకరయ్య నియోజకవర్గ నాయకులు అనిల్,రామరాజు, జయరామరాజు,చెన్నయ్య, చంద్రపాల్, నారాయణ, శివరాం, సూరి, జైపాల్, గాయాల చెన్నయ్య, నరసింహ, లూకయ్య,శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడాలి

దువ్వూరు, మార్చి 11, ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీల పరిధిలో ఎటువంటి మంచినీటి సమస్య రాకుండా చూడవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లదే అని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణంపల్లె, ఇడమడక, నారాయణ పల్లె, బయనపల్లె గ్రామాలలోని రక్షిత మంచినీటి పథకాలను, పైప్ లైన్‌లను అలాగే మోటార్లను పరిశీలించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులను వారానికి ఒకసారి శుభ్రం చేయాలని తెలిపారు. ఆయన వెంట ఈఓపిఆర్డి హరికృష్ణ, ఏఈ శివకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

14 నుంచి జమాల్ వల్లి ఉరుసు ఉత్సవాలు

దువ్వూరు, మార్చి 11, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీ జమాల్ వల్లి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 14వ తేది నుంచి 16వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ జమాల్ వల్లి స్వామికి ఎన్నో మహిమలు కలిగి ఉన్నారని 1883వ సంవత్సరంలో కృష్ణంపల్లె గ్రామంలో ఆయన పరలోక గతులైరి. జీవిత కాలంలో జరిగిన అద్భుత కార్యక్రమాలు దైవభక్తి గల వారికి తెలుసును. అప్పటి నుండి ఈ ఉరుసు ఉత్సవాలను 3రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 14వ తేదిన గంధం, 15వ తేదిన ఉరుసు, 16వ తేదిన జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14వ తేది శుక్రవారం గంధం రోజున బాణ వినోదాలతో మహోత్సవం మొదలౌతుందన్నారు. ఉరుసు సంధర్భంగ 15వ తేదిన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన ఎద్దులకు 30వేలు, 20వేలు, 10వేలు, 5వేలు బహుమతులు అందజేస్తారన్నారు.

మామిడి చెట్లకు నిప్పు.. 3 ఎకరాల తోట దగ్ధం

అగ్నికి దగ్ధమైన మామిడి తోట వద్ద రఘునాథ రెడ్డి, అమరావతి

తంబళ్లపల్లె మార్చి 11 ప్రభాతవార్త ః

గుర్తు తెలియని దుండగులు నిండు పూతతో గల మామిడి తోటకు నిప్పు పెట్టడంతో దగ్ధమై సుమారు లక్ష ఆస్తి నష్టం జరిగిన దురదృష్టకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కోసువారిపల్లె పంచాయతీ దిగువ ముట్రవారిపల్లెకు చెందిన రైతు రఘునాథరెడ్డి, అమరావతిలకు చెందిన మూడు ఎకరాల మామిడి తోట ఫలసాయంతో జీవనోపాధి. ఈ ఏడాది సైతం మామిడి తోటకు అప్పులు చేసి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటంతో ఆశించిన స్థాయిలో పూత పూయడంతో ఆ రైతు కుటుంబం వచ్చిన ఆదాయంతో నష్టాల నుండి గట్టెక్కవచ్చునని సంతోషించారు. అయితే వారి ఆశలపై నీళ్లు చల్లుతూ గుర్తు తెలియని దుండగులు ,నిప్పు పెట్టడంతో మామిడి తోట పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రఘునాథరెడ్డి, అమరావతిలు తోటను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. నోటికి వచ్చిన పంట దగ్ధమవడంపై చేసిన అప్పులు ఎలా తీర్చాలి రా దేవుడా అంటూ రోదించారు. ఈ విషయమై తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దశాబ్దాలుగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటున్న మామిడి తోట కాలి బూడిదవడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ మామిడి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మిట్స్‌కు బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబరేటరీస్

కురబలకోట మార్చి 11 ప్రభాతవార్త

అంగళ్ళు సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె మిట్స్ కళాశాలకు చెందిన సివిల్ డిపార్టుమెంట్ విభాగానికి నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (NABL) నాలుగేళ్ల పాటు అక్రెడిటేషన్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలియజేసారు. ఈ ప్రతిష్ఠాత్మక NABL అక్రెడిటేషన్, కళాశాల యొక్క విద్యా మరియు పరిశోధన రంగాల్లో ఉన్నత ప్రమాణాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ గుర్తింపు ద్వారా ల్యాబొరేటరీ సదుపాయాలు, సాంకేతిక నైపుణ్యాలు, మరియు నాణ్యతా నిర్వహణ వ్యవస్థలు అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నాయని తెలియజేస్తుంది. ఈ గుర్తింపు ద్వారా పరిశోధన సామర్థ్యాలను పెంచుకోవడమే కాకుండా, పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుని, విద్యార్థులు మరియు ఇతర భాగస్వాములకు మెరుగైన సేవలను అందించగలదు. ఈ ఘనతను సాధించడానికి కృషిచేసిన అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, సివిల్ విభాగాధిపతి డాక్టర్. దీపాంకర్ రాయ్ అభినందనలు తెలియజేసారు.

వన్యప్రాణుల దాహార్తి కోసం నీటి కుంటలు

సిద్ధవటం, మార్చి 11, ప్రభాతవార్త:

వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని సిద్ధవటం రేంజిలోని అటవీ పరిసరాల్లో వన్యప్రాణులకు, అడవి జంతువులు తాగునీటి సౌకర్యాలను కల్పించామని రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వన్యప్రాణులు, అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి రాకుండా కడప డీఎఫ్ఏ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు అటవీ ప్రాంతాల్లోని సాసర్ పీట్లతో పాటుగా పలు నీటి కుంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. గ్రామాల్లోకి వన్యప్రాణులు, అడవి జంతువుల వస్తే ప్రజలు వాటికి ఎలాంటి ప్రాణ హాని తలపెట్టవద్దన్నారు. గ్రామాల్లో అడవి జంతువులు వస్తే తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అడవి జంతువులకు హాని తలపెట్టినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ

ఖాజీపేట, మార్చి 11, ప్రభాతవార్త:

జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ ఖాజీపేట విద్యుత్ సిబ్బందితో మంగళవారం నాడు ఖాజీపేటలో సమావేశం నిర్వహించారు. ముందుగా ఖాజీపేట విద్యుత్ కేంద్రంలోని విద్యుత్ లైన్లు మరియు చుట్టుప్రక్కల ట్రాన్స్ ఫార్మర్లను, వివిధ చోట్ల విద్యుత్ తీగలను క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మరియు విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన సరిచేయాలని ఆదేశించారు. తదుపరి ఖాజీపేటలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులతో మరియు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించుటకు అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవిలో ఒక్క క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని కావున లైన్ల వెంబడి తిరిగి లోపాలను గుర్తించి మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. లైన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్‌లకు అడ్డు వచ్చిన కొమ్మలను తొలగించి అంతరాయం లేని నాణ్యమైన నిరంతరం విద్యుత్ ప్రజలకు అందించాలని ఆదేశించారు. రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి తదితర సనులుపై వెంటనే స్పందించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవగాహణ కార్యక్రమాలు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. వాలిపోయిన స్థంబాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ మాట్లాడుతూ వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచే విధంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణీకృష్ణ, ఖాజీపేట మండల బాధ్య అసిస్టెంట్ ఇంజనీర్ నాగరాజు, లైన్ ఇన్స్పెక్టర్ నారాయణ మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుణాల ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

చిన్నమండెం, మార్చి 11ప్రభాత వార్త :

చిన్నమండెం మండలం, కొత్తపల్లి గ్రామంలో ఈనెల 13, 14వ తేదీలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే మల్లూరమ్మ దేవత తిరుణాల ఉత్సవ ఏర్పాట్లను మంగళవారం టిడిపి నాయకులు మోర్యరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మోర్యరెడ్డి మాట్లాడుతూ మార్చి 13, 14 వ తేదీలలో జరిగే మల్లూరమ్మ దేవత తిర్నాల ఉత్సవాల అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడం జరుగుతుందని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా మల్లురమ్మ దేవత ఆలయానికి సంబంధించి భక్తులకు మరుగుదొడ్లు, మరియు ఆలయ ప్రాంగణంలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని టిడిపి నాయకులు మోర్యరెడ్డికి తెలిపారు. ఈ సమస్యలన్నీ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థుల కోసం పరీక్ష

రాజంపేట అర్బన్, మార్చి11 ప్రభాతవార్త

ఎస్.ఎఫ్.ఐ యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రజ్ఞా వికాసం పేరుతో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు బహుమతులు ప్రధాన కార్యక్రమంలో రాజంపేట పట్టణం మన్నూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. ప్రమీల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞ వికాస్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు టాప్ ఫైవ్ వచ్చిన వారికి బహుమతులు అందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మన్నూరులోప్రతిభ కనబరిచిన మొదటి బహుమతి ఈ. గీతిక, రెండవ బహుమతి సబీహ కు అందజేశారు. రాజంపేట పట్టణంలో ఉన్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ప్రతి స్కూలు నుండి ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు కూడా బహుమతులు అందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులందరూ కూడా కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యం సాధన కోసం ముందుకు వెళ్లాలని అన్నారు. తల్లిదండ్రుల యొక్క కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని వారి యొక్క లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా ఉన్నతమైన చదువులు చదివి ఈ ప్రాంతానికి ఊరికి తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఓబులేష్ ,వెంకట రామరాజు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు మనోజ్, అబ్రహం పాల్గొన్నారు.

బిజెపి ఎమ్మెల్సీ సోమవీర్రాజును కలిసిన సాయి లోకేష్

రాజంపేట అర్బన్, మార్చి11 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు, తాజాగా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సోము వీర్రాజు ను రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ మంగళవారం కలిశారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ పార్టీ కోసం విధేయతగా పనిచేస్తే ఇప్పుడైనా మంచి అవకాశాలు లభిస్తాయని సాయి లోకేష్‌కి సూచించారు. అంకితభావంతో పార్టీ కోసం పని చేయాలని తెలిపారు. సోము వీర్రాజును కలిసిన వారిలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ కూడా ఉన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచండి

అసెంబ్లీలో శాసనసభ్యులు నల్లారి

పీలేరు మార్చి 11 ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు 27,000 వేల మంది ఉన్నారని చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని వాళ్లకు వేతనాలు పెంచి ఇవ్వాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప